


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

**ఆమె ఆలోచనలు** శరవేగంగా సాగినయ్. ఎక్కడా జారిపోకుండా తను ఈ పరిస్థితిని హేండిల్ చెయ్యాలి. అవును మరి. ఇదంతా తనెవరో తెలియనప్పుడు చేసింది. ఇప్పుడెలా కనుక్కున్నాడో, ఇక్కడికే వచ్చేశాడు. ఇక్కడ నానా రభస చెయ్యొచ్చు. తనని నిలదీయవచ్చు. 'క్రైసిస్ మానేజ్‌మెంట్' లో అదే చెబుతారు. కష్టం వచ్చినపుడు ఎలా ఎదుర్కోవాలో రకరకాల పద్ధతులున్నాయి. మొదటిది 'నువ్వు ఓడిపోయినట్టు కనిపించకు'. అన్నిటికన్నా ముఖ్యమైనది అదే. ఒక్కసారి అలా కనిపిస్తే అవతలివాళ్ళు నిన్ను డామినేట్ చేయడానికి ప్రయత్నిస్తారు. అందుకని ఆమె కఠిన స్వరంతో ''ఎవర్నువ్వు?'' అని అడిగింది.

అతడు పీటర్ వైపు చూపిస్తూ ''ఆయన దగ్గర పని చేసేవాడిని'' అన్నాడు.

''అయితే ఇక్కడికి ఎందుకొచ్చావ్?''

''ఆయనతో కాస్త పనుండి.''

ఆమె మరింత స్వరం హెచ్చించి, ''నీ యజమానితో పనుంటే నువ్వు ఆయన్ని మీ ఆఫీసులో కలుసుకోవాలి'' అంది. అతను మాట్లాడలేదు. ''వెళ్ళు... వెళ్ళు... ఆయన ఎక్కడుంటే అక్కడకు ఇలా వెతుక్కుంటూ రాకూడదు'' హెచ్చరిస్తున్నట్టు అంది.

అతడు అడుగు ముందుకేసి, చేతిలో బ్రీఫ్‌కేసు ముందుకు సాచుతూ ''ఇందులో ఆయన డబ్బు మర్చిపోయారు'' అన్నాడు.

ఆమె అప్రతిభురాలై అతనివైపు చూసింది. తాము తప్పు చేశామని నిరూపించడానికి అతడు వల బిగిస్తున్నాడు అనుకుంది. అతడిని డిఫెన్సులో పడవేయటానికా అన్నట్టు ''అదృష్టవంతుడివి. నీ మీద ఇప్పుడే పోలీసు రిపోర్టు ఇద్దామనుకుంటున్నాం. కరెక్ట్‌గా డబ్బు తీసుకొచ్చి బ్రీఫ్‌కేసుతో సహా అప్పగించ బట్టి బతికిపోయావ్'' అంది.

అతడు దాన్ని పట్టించుకున్నట్టు కనిపించలేదు. పీటర్ వైపు తిరిగి ''ఇందులోంచి నా దారి ఖర్చుల నిమిత్తం అయిందొందలా ముప్ఫయి రూపాయలు తీసుకున్నాను. లెక్క కూడా వ్రాసి ఆ బ్రీఫ్‌కేసులో పెట్టాను'' అన్నాడు.

ఆమె ఎగతాళిగా ''బ్రీఫ్‌కేసు బద్దలుకొట్టి లోపల ఎంత క్యాష్ ఉందో చూశావా?'' అన్నది.

అతడు భావరహితమైన దృష్టితో ఆమెని చూశాడు. పీటర్‌ని చూపిస్తూ ''ఈయన లక్ష్మణ్‌పూర్‌లో ఈ పెట్టె ఇవ్వాలి. చాలా అర్జెంట్ అన్నారు. నాకేమో ఆ లక్ష్మణ్‌పూర్ అడ్రస్ తెలీదు. బ్రీఫ్‌కేస్‌లో ఉందేమో అని బలవంతంగా తెరవవలసి వచ్చింది'' అన్నాడు.

''అంతేకాని డబ్బుకోసం తెరవ లేదంటావ్?'' ఉక్రోషంతో అడిగాడు ప్రతాపరెడ్డి. తన అసిస్టెంటయిన పీటర్ ప్లాను మొత్తం పాడుచేయడం అతడికి తలకొట్టేసినట్లుగా ఉంది.

''నేను డబ్బుకోసం తెరవలేదు. నా చేతికిచ్చిన కవర్లో నా మీద కక్ష సాధింపు చర్యగా నన్ను ఆ ఎడారికి పంపినట్టు ఉంది. అది నాకూ శ్రీకళ్యాణిగారికి సంబంధించిన విషయం. మాకూ మాకూ జరిగిన గొడవలో అనవసరంగా (పీటర్‌ని చూపిస్తూ) ఈయన బలి అయిపోవటం ఎందుకనిపించింది. అందుకే రాజ్‌మాండ్ వరకూ హడావుడిగా ఈయన దొరుకుతారేమో అని వెళ్ళాను. ఆయన అక్కడ లేకపోయేసరికి అప్పుడు అనుమానం వచ్చింది– ఆయన కూడా మీ మనిషేమో అని. అప్పుడు బ్రీఫ్‌కేసు విప్పాను.''

''అప్పటివరకూ బ్రీఫ్ కేసు విప్పలేదా?'' పాయింట్ దొరికినట్టు అడిగింది శ్రీ కళ్యాణి.

''లేదు.''

''ఎందుకని?''

''అది కష్టమరు డబ్బు కాబట్టి!''

''నీ దగ్గర డబ్బుందా?''

''లేదు.''

''మరి నీ దగ్గర పైసా డబ్బు లేకుండా రాణీమర్ నుంచి రాజ్‌మాండ్ వరకూ రాత్రికి రాత్రి పది కిలోమీటర్లు ఎలా వచ్చావ్?''

''పరుగెత్తుకుంటూ''

ఒక చల్లటిగాలి తమ మీదనుంచి వెళ్ళిపోయినట్టు ముగ్గురూ సన్నగా వణికారు. అక్కడి నిశ్శబ్దంతో అతడి నిజాయితీ చేరి వాళ్ళ మనసుల్ని తొలిచేస్తోంది.

ఆమె అతడికి ఉత్తరం వ్రాసి హేళన చెయ్యాలనుకుంది. తన మనిషి అతడి దగ్గర లక్ష రూపాయలు వదిలేశాడని తెలిసి కోపం వచ్చింది. కానీ ఇప్పుడు అతడా లక్ష రూపాయలూ తిరిగి తీసుకు రావడం ఆమెకు మరింత ఇబ్బంది కలగజేస్తోంది. మనుషుల్లో ఇంత నిజాయితీపరులుంటారని ఆమెకిదే మొదటిసారి తెలియటం. అది కూడా కాదు. అంత చీకట్లో ఆ ఎడారిలో అన్ని సామాన్లు పట్టుకుని పరుగెత్తడం! ఎముకలు కొరికే చలిలో, కూరుకుపోయే ఇసుకలో పది కిలోమీటర్లు వెళ్ళటం! అదీ ఎవరి కోసం? తనని మోసం చేసిన మనిషిని పట్టుకుని తిరిగి అతడికి సాయం చేయటం కోసం!!

ఆమె అతడి వైపు సూటిగా చూడలేక తల దించుకుంది. ఆ హాల్లో వివేకానందుడి ఫోటో కూడా తనని నిలదీస్తున్నట్టు అనిపించింది.

ఈ మొత్తం వ్యవహారం పట్ల సంతోషంగా ఉన్నది పీటర్ ఒక్కడే. పోయాయనుకున్న లక్ష రూపాయలు దొరికాయి. అదీ సంతోషం! ఆ సంతోషంలో అతడు కార్తికేయ వైపు తిరిగి ''మా అడ్రసు ఎలా దొరికిందోయ్ నీకు?'' అని అడిగాడు.

''నేనొకసారి ఈ ప్రతాపరెడ్డిగారి దగ్గరకి ఇంటర్వ్యూకి వెళ్ళాను. అప్పుడే ఈమె దగ్గర నుంచి ఫోన్ వచ్చింది. ''ఎవరు కళ్యాణా?'' అని ఆయన అన్నారు. అట్నుంచి ఈమె ఏదో అడిగితే 'ఆ డాక్టర్ పేరు అశ్వత్థామ' అని, ఆ తర్వాత నా ప్రసక్తి వచ్చింది. కళ్యాణి గారు నా గురించిన వివరాలన్నీ ఇన్వెస్టిగేట్ చేయమని ఈయనతో చెపుతూండగా పక్కనే ఉన్నాను.''

భూమి రెండుగా చీలిపోయి తను అందులో కూరుకుపోతే బాగుణ్ణు అనుకున్నాడు ప్రతాపరెడ్డి. అప్పటివరకూ అతడు *'సిగ్మా డిటెక్టివ్ ఏజెన్సీ చాలా గొప్ప సంస్థ. అక్కడనుంచి ఒక్క రహస్యం బయటకు పోదు'* అని అందరితో చెపుతూ వచ్చాడు. కానీ ఇప్పుడు తను ఎంత బాధ్యతా రహితంగా ప్రవర్తించాడో వింటూంటే అక్కణ్ణుంచి పారిపోవాలని అనిపించింది.

శ్రీకళ్యాణి పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. 'అతనెవరో తనకి తెలియటానికి ముందే తనెవరో అతనికి తెలుసు'. ఈ వాస్తవం ఆమె హృదయాన్ని కవ్వం చిలికినట్లు చిలుకుతోంది.

ఇక అక్కడ తన అవసరం లేనట్టు కార్తికేయ బయటకు నడిచాడు. ఈ హడావుడిలో ప్రతాపరెడ్డి ఎప్పుడు జారుకున్నాడో తెలియదు. కళ్యాణి ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు.

ఇంత నాటకీయమైన సంఘటనలోనూ కర్తవ్యాన్ని మర్చిపోని వ్యక్తి ఒక్కడే. పీటర్. హిమాలయాల ఎత్తుకు ఎదిగిపోయిన కార్తికేయకు కృతజ్ఞతలు చెప్పుకోవలసిన బాధ్యత తన మీద ఉన్నట్టు అతను భావించి పరుగున బయటకి వచ్చాడు. లోపల ఇంకా కళ్యాణి శిలా ప్రతిమలాగా అలాగే ఉంది. కార్తికేయ చెప్పులు తొడుక్కుంటూ ఉన్నాడు. వెనుకనుంచి దగ్గరగా వెళ్ళి ''ఈ గొడవతో నాకు సంబంధం లేదు. నేను నిమిత్తమాత్రుడిని'' అన్నాడు పీటర్.

''నాకు తెలుసు.''

''లక్ష రూపాయలు తీసుకొచ్చి ఇచ్చి నా ఉద్యోగం నిలబెట్టారు. థాంక్స్.''

''ఫర్వాలేదు'' అని కార్తికేయ వెళ్ళిపోవటానికి మెట్లు దిగసాగాడు.

''ఒక్క ప్రశ్న అడుగుతాను సమాధానం చెపుతావా బాబూ''.

కార్తికేయ ఆగాడు. ''నీ గురించి తెలుసుకోవటానికి ఆవిడ డిటెక్టివ్‌లని నియమించింది. నువ్వు చేసిన చిన్న తప్పుకి ఎడారి మధ్యలో నిస్సహాయంగా ఒంటరివాణ్ని చేసింది. అదలా పక్కన పెట్టు. ఆవిడ ఎవరో నీకు తెలుసు. 'నీ ఉద్యోగం పోయింది ఆవిడ వల్లనే' అని కూడా నీకు తెలుసు. అయినా ఆవిడ మీద నీకు కోపం రాలేదా? పట్టుకుని దులిపెయ్యాలని అనిపించలేదా?''

కార్తికేయ నెమ్మదిగా తలెత్తాడు ''లేదు'' అన్నాడు. ''...అత్యంత ఉత్తమమైన గుణం 'పట్టుదల'! అత్యంత హీనమైన స్థాయి భావం 'పగ'! ఉత్తమమయిన పట్టుదలని, హీనమైన 'పగ' కోసం ఉపయోగించడం అనవసరమని నా అభిప్రాయం.''

పీటర్ ఇబ్బందిగా చూస్తూ ''నాకు అర్థంకాలేదు'' అన్నాడు.

''నా మీద కోపంతో ఆవిడ కనీసం కొన్ని రోజులపాటు ప్రశాంతతని దూరం చేసుకుంది. ఆమె మీద జాలితో నేను నిర్మలంగా ఉన్నాను. అదీ తేడా'' అని అతడు అక్కడనుంచి కదిలి వెళ్ళిపోయాడు. వాళ్ళిద్దరూ మాట్లాడే మాటలు కళ్యాణికి స్పష్టంగా వినిపిస్తున్నాయి. పశ్చాత్తాపం అన్న పెద్ద మాట అనవసరం కానీ, ఆమెలో ఎక్కడో ఏదో కదుల్తోంది.

''చివరి ప్రశ్న. నా మీద నీకేం కోపం లేదుగా.''

''నాకు ఎప్పుడూ ఎవరి మీదా కోపం రాదు.''

కళ్యాణి తలెత్తి కిటికీలోంచి చూసింది. కార్తికేయ మెయిన్ గేటు దాటుతూ కనిపించాడు. తల తిప్పి పటం వైపు చూసింది. ఎందుకో తెలీదుకాని హాల్లో వివేకానందుడి ఫోటో పూర్వంకన్నా బ్రైట్‌గా కనిపించింది.

## 6

నగరంలోకెల్లా రష్‌గా ఉండే రోడ్డు. శ్రీకళ్యాణి తన టయోటా డ్రయివ్ చేస్తోంది. ''సో... మీ పెద్దకొడుకు అమెరికా వెళ్లాలి. మీ పెద్ద కూతురు పెళ్ళి చేయాలి'' అంది. పక్క సీట్లో కూర్చున్న ప్రతాపరెడ్డి సమాధానం చెప్పలేదు. ''మీకు ఈ రెంటికీ కలిపి లక్ష రూపాయలు కావాలి.''

''అవునమ్మా.''

''మీకీ లక్షరూపాయలూ అడ్వాన్సుగా కావాలా? అప్పుగా కావాలా?'' అని అడిగింది.

''రెంటికీ తేడా ఏముందమ్మా?''

''వడ్డీ''

ఎవరో కొట్టినట్టయి తెల్లబోయి చూశాడు. వ్యాపారం అంటే అర్థమయింది. నిజానికి తను తన అవసరం చెప్పగానే, 'దానిదేముంది. లక్ష రూపాయలేగా. తీసుకోండి' అంటుంది అనుకున్నాడు. ఇన్ని ప్రశ్నలు వేస్తుందనుకోలేదు. తల తిప్పి ఆమె వైపు చూశాడు. ఏకాగ్రతతో డ్రైవ్ చేస్తోంది. ''నీ ఇష్టమమ్మా. నువ్వెలా అనుకుంటే అలా. నాకు మాత్రం వారం రోజుల్లో కావాలి.''

సూపర్ మార్కెట్ దగ్గర కారు పక్కకి తీసి ఆపుతూ ''మా అకౌంటెంట్‌తో చెపుతాను. మిగతా విషయాలు అతను మాట్లాడతాడు'' అని కారు దిగి 'రండి' అంది.

ప్రతాపరెడ్డి కొంచెం 'హర్ట్' అయ్యాడు. ఆమెకు దగ్గరవ్వాలని ప్రయత్నించిన వారిలో ప్రతాపరెడ్డి కూడా ఉన్నాడు. అయితే ప్రేమికుడిలా కాదు. తండ్రిలా...! చిన్న వయసులోనే కోటీశ్వరురాలైన ఒంటరి అమ్మాయికి ప్రతి వాళ్ళూ

దగ్గరవ్వటానికి ప్రయత్నిస్తారు. సలహాలిస్తారు. ఆ విధంగా అతనూ ట్రై చేశాడు. ఆమె మాత్రం దూరంగా ఉంచింది. అతడినే కాదు... అందర్నీ!!

అందరి దగ్గరా సలహాలు తీసుకుంటుంది. కానీ ఎవర్నీ మనసుకి దగ్గరగా రానివ్వదు. అదీ ఆమె మనస్తత్వం. ఆ విషయం తెలిశాక ఆయన ఆమెతో కేవలం బిజినెస్ బంధుత్వం మాత్రమే పెట్టుకుని, అప్పట్నుంచీ సంతోషంగా ఉన్నాడు.

రెండంతస్తుల సూపర్ మార్కెట్ అది. ఆమె షాపింగ్ పూర్తి చేసేసరికి అరగంట పట్టింది. సామాన్లు తీసుకుని మెట్లు దిగుతూ ''మీకింకా ముగ్గురు కూతుళ్ళు ఉన్నట్టున్నారు. వచ్చే మూడు సంవత్సరాల్లో ప్రతి ఏడాదీ ఇలా లక్ష కావాల్సి వస్తుందనుకుంటాను'' అంది. ఆయన ఏడవలేక నవ్వుతూ, 'అవునన్నట్టు' తలూపాడు.

కారు రోడ్డు కవతల పార్కింగ్‌లో ఉంది. ఆమె చివరి మెట్టు దిగుతూ ఉండగా చెప్పు తెగింది. మరి నడవటానికి వీల్లేకుండా తెగటంతో ఆమె పక్కనే ఉన్న పాలిష్‌వాలా దగ్గరకి వెళ్ళి చెప్పు అతని ముందు ఉంచి నిలబడింది.

''నా దగ్గర పాలిష్ సామానులు మాత్రమే ఉన్నాయి మేడమ్'' అన్నాడు.

''గాడ్. ఈ చెప్పుతో రోడ్డు దాటటం ఎలా?'' స్వగతంగా అనుకుంది.

ప్రతాపరెడ్డి కల్పించుకుని, ''కొత్త చెప్పులు కొనుక్కుందాం అమ్మాయ్. పద. సూపర్ మార్కెట్‌లో దొరుకుతాయి'' అన్నాడు.

''మీరొక రెండు నిముషాలు ఇక్కడ నిలబడితే నేవెళ్ళి కుట్టించుకు వస్తాను'' అన్నాడు అతడు తలెత్తి. అప్పుడు చూసింది అతడిని. చూసి విస్మయంతో ''నువ్వా'' అంది. అతను కార్తికేయ. మౌనంగా చెప్పులు తీసుకుని వెళ్ళాడు.

''వండర్ఫుల్ ఫెలోలా ఉన్నాడే'' అన్నాడు ప్రతాపరెడ్డి అతడు వెళ్లాక.

''ఇతను మీ దగ్గర ఇంటర్వ్యూకి వచ్చాడన్నారు కదూ?''

''అవునమ్మా.''

''ఏ ఉద్యోగం కోసం?''

''ఆఫీస్ బాయ్... అదీ దొరక్క పోయేసరికి, పొట్ట గడవడం కోసం ఈ పని మొదలు పెట్టాడనుకుంటాను'' అన్నాడు. ఆమె మరేమీ మాట్లాడలేదు. ఈ లోపులో కార్తికేయ చెప్పులు కుట్టించి తీసుకువచ్చాడు. ఆమె పది రూపాయలు అందించింది. అతడు మూడు రూపాయలు తిరిగి ఇస్తూ ''అక్కడ ఆర్రూపాయలు తీసుకున్నారు మాడమ్'' అన్నాడు.

ఆమె తలూపి రోడ్డు అవతలి వైపున్న కారు వద్దకు నడిచింది. ప్రతాపరెడ్డిని ఆఫీసు దగ్గర దింపి ఆయన కారు దిగే ముందు, పీటర్‌ని ఒకసారి తన దగ్గరకు పంపమని కోరింది. ఆమె తన కార్యాలయానికి చేరుకున్న అరగంటకు పీటర్ వచ్చాడు.

''కార్తికేయ మీ దగ్గర నాలుగైదు రోజులు పని చేశాడు కదా. అతడి మీద మీ అభిప్రాయం ఏమిటి?'' పీటర్ కూర్చున్నాక అడిగింది. ఆమె ఎందుకు పిలిచిందో, మళ్ళీ ఏం గొడవ వచ్చిందో అని భయపడుతూన్న పీటర్ ఆమె ఈ ప్రశ్న అడిగేసరికి తెల్లబోయి ''మంచివాడిలా ఉన్నాడు మాడమ్. లేకపోతే లక్ష రూపాయలు...'' అంటూ ఏదో చెప్పబోయాడు. ఆమె మాటలు మధ్యలో ఆపు చేస్తూ ''ఆ విషయం నాకు తెలుసు. అతని క్వాలిఫికేషన్ ఏమిటి?'' అని అడిగింది.

''నాకు తెలీదు మాడమ్.''

''అతడి అడ్రస్ మీకు తెలుసు కదా. ఒకసారి అతడిని నా దగ్గరకి పంపించండి''

పీటర్ తలూపాడు.

''అందు కోసమే పిలిపించాను. ఇక మీరు వెళ్ళిరండి.''

ఆమె ప్రొద్దున్న లేచి తయారయి క్రిందకు వచ్చేసరికి విజిటర్స్ రూమ్‌లో కూర్చుని ఉన్నాడు కార్తికేయ. ఆమెని చూసి లేచి నిలబడ్డాడు. వెళ్ళి అతని ఎదుట సోఫాలో కూర్చుంటూ ''ప్లీజ్ సిట్ డౌన్'' అంది.

''ఫర్వాలేదు చెప్పండి.''

''నీ క్వాలిఫికేషన్ ఏమిటి?''

''ఇంటర్మీడియట్.''

''అంత తక్కువ చదువుకున్నవాడివి సైకాలజీ గురించి ఆ రోజు ఫోన్‌లో అంత బాగా ఎలా చెప్పావ్?''

''నాకు తెలిసిందేదో చెప్పానండి. అంతే.''

''లక్ష రూపాయలు దొరికినా తీసుకోకుండా వెనక్కి తీసుకురావడంతో నీ నిజాయితీ నాకు నచ్చింది. నీకు ఏదైనా ఉద్యోగం ఇద్దామనుకుంటున్నాను. ఏం చెయ్యగలవు నువ్వు?" అంది. నిజానికి అది ఒక్కటే కాదు ఆమెకు నచ్చింది. తను అంత 'ఇరిటేట్' చేసినా అతను మామూలుగా ఉండగలగడం... పైగా 'పట్టుదల' గురించి అతను మాట్లాడిన విధానం... అది నచ్చింది.

''షాపులో మెకానిక్‌గా చేశాను. టెంపరరీగా ఇంకో చోట బ్యాంక్ అకౌంట్స్ చూశాను. వంట బాగా చెయ్యగలను.''

''ఇన్ని పనులు చేయగలవాడివి, బూట్‌పాలిష్ ఎందుకు చేస్తున్నావు?''

''రోజు గడవడం కోసం...''

ఆ సమాధానానికి ఆమె వద్ద మరో ప్రశ్న లేదు. టాపిక్ మారుస్తూ ''నీకేం ఉద్యోగం ఇవ్వాలా? అని ఆలోచిస్తున్నాను. డిగ్నిటీ ఆఫ్ లేబర్ లేదు కాబట్టి మా ఇంటిలో వంటపని చేస్తావా?''

''చేస్తాను మాడమ్.''

''గుడ్. నిన్ననే మా వంటమనిషి పని మానేసింది. నువ్వు జీతం గురించి ఏమీ ఆలోచించకు. మీ డాక్టరుగారు ఇచ్చిన దాని కంటే ఎక్కువే ఇస్తాను. ఇక్కడ కొంతకాలం పని చేశాక, మా ఆఫీసులోనే ఏదో ఒక దాంట్లో చూస్తాను. నీలాటి నిజాయితీపరులు మా ఆర్గనైజేషన్‌కి ఎంతో అవసరం'' అంటూ లేచింది.

ఆమెకు ఎంతో రిలీఫ్ అనిపించింది. అవుట్–హవుస్‌లో ఎన్ని కుటుంబాలున్నా ఇంట్లో ఉండే నలుగురూ ఆడవాళ్ళే. పైగా అతని లాటి స్నేహితుడు, తండ్రి, లేక అన్నయ్య ఉంటే బావుండును అనిపించే పెర్సనాలిటీ అతడిది. ఏదో తెలియని గొప్ప మ్యాస్కులినిటీ ఉంది. దానికన్నా ముఖ్యంగా అతడి వదనం, వర్షం పడిన తరువాత చెట్ల ఆకులు మరింత పచ్చదనాన్ని సంతరించుకుని ఎలా నిర్మలంగా ఉంటాయో అలా ప్రశాంతంగా ఉంటుంది.

హాలు పక్కనే ఉన్న గది చూపిస్తూ ''ఇది నువ్వు ఉండే గది. నీ సామాన్లు అన్నీ తెచ్చేసుకో'' అంది. అతడు తలూపాడు. అతడా ఇంట్లో ఉండటానికి సత్యం అభ్యంతరం తెలిపాడు. అయితే, ఒక్క తల విదిలింపుతో దాన్ని ఆమె తోసి పుచ్చింది.

మరుసటి రోజు ప్రొద్దున్నే సిగ్మా ఏజెన్సీ ప్రతాపరెడ్డిని పిలిపించింది. ''మీరు ప్రతీ మూడు నెలలకీ పంపే వ్యక్తిగత స్క్రూటినీ లిస్ట్‌లో సత్యం పేరు చేర్చండి. అతడి కార్యకలాపాలన్నీ నాకు తెలియాలి. అతడి అలవాట్లు, డబ్బు సమస్యల్లో ఉన్నాడా వగైరా...'' అంది. ప్రతాపరెడ్డి ఆశ్చర్యాన్ని తనలోనే దాచుకుని 'అలాగేనమ్మా' అన్నాడు.

''అంతేకాదు. సత్యం ప్రియురాలు ఎవరు? ఆమె గత చరిత్ర ఏమిటి? మొత్తం వివరాలన్నీ...'' అంది. ప్రతాపరెడ్డి వెళ్ళిపోయాక ఆలోచనలో పడింది. సత్యాన్ని కేవలం ఒకమ్మాయితో చూడటం వలన ఈ నిఘా పెట్టటం సమంజసమేనా అని ఆమె ఆలోచిస్తోంది.

సత్యం అంతకన్నా పెద్ద ప్లాన్‌లో ఉన్నాడనీ, అతడి వెనుక డాక్టర్ అశ్వత్థామ కూడా ఉన్నాడనీ ఆమెకి తెలీదు. ఇద్దరూ కలిసి తనకి స్లో పాయిజన్ ఇవ్వబోతున్నారనీ, తన ప్రాణాలకే ప్రమాదం రాబోతోందనీ తెలిస్తే ఆమె మరిన్ని జాగ్రత్తలు తీసుకునేదేమో!

ఇది జరిగిన గంటకి ప్రతాపరెడ్డి సత్యాన్ని కలుసుకున్నాడు. ''ఒకప్పుడు నువ్వు నా దగ్గరకి వచ్చావు. నీతో చేతులు కలిపితే నన్ను డబ్బులో ముంచెత్తుతానన్నావు. ఏజెన్సీ పెట్టిన కొత్త కాబట్టి నేనొప్పుకోలేదు. ఈ విషయం బయటపడితే నా ప్రాణాలు తీస్తానన్నావు. నీ సంగతి నేనెక్కడా బయట పెట్టలేదు.''

''ఇదంతా ఇప్పుడెందుకు చెప్తున్నారు?''

''నాకు ఇప్పుడు డబ్బు అవసరం చాలా ఉంది. కూతురి పెళ్ళి చేయాలి. కొడుకుని అమెరికా పంపాలి. రెంటికీ కలిపి లక్ష కావాలి. అదిస్తే నీతో చేతులు కలుపుతాను. నీకో ముఖ్యమైన రహస్యం కూడా చెపుతాను.''

''ఏమిటది?''

‘‘డబ్బు ఇస్తే చెబుతాను.’’

‘‘లక్ష రూపాయలా?’’

‘‘నీ తండ్రికి పక్షవాతం వచ్చినప్పుడు శ్రీకళ్యాణి స్వామి వారికి లక్ష రూపాయలు ఇచ్చి ఆస్తి రాయించుకుంది. తిరిగి ఆస్తి సంపాదించుకోవాలంటే నువ్వు నాకు లక్ష రూపాయలు ఇచ్చుకోవాలి.’’

సత్యం లక్ష తీసుకువచ్చి ఇచ్చి, ‘‘ఏమిటా రహస్యం?’’ అని అడిగాడు.

డబ్బు తీసుకుంటూ – ‘‘కొందరు వ్యక్తుల మీద నిఘా వేసి ఎప్పటికప్పుడు ఆ రిపోర్టులు శ్రీకళ్యాణికి పంపుతుంది మా ఏజెన్సీ. ఇదంతా ఎంతో రహస్యంగా, పకడ్బందీగా జరుగుతుంది. మిస్టర్ సత్యం. ఈ రోజు నుంచీ నీ పేరు కూడా ఆ లిస్టులో చేర్చమని శ్రీకళ్యాణి మా ఏజెన్సీని కోరింది’’ అన్నాడు ప్రతాపరెడ్డి.

సత్యం మొహం కోపంతో, ద్వేషంతో, కసితో నల్లగా కమిలిపోయింది! అతికష్టం మీద తనని తాను సంభాళించుకుని ‘‘సరే... దానికి ఎలా పాఠం చెప్పాలో నాకు బాగా తెలుసు’’ అన్నాడు.

ప్రతాపరెడ్డి లేచాడు. ‘‘... నీకు ఎప్పటికప్పుడు ఈ వివరాలన్నీ కావాలా?’’ అని అడిగాడు.

‘‘మీరు నా గురించి మంచి రిపోర్టు ఇవ్వటం కోసమే లక్షల రూపాయలు ఇచ్చాను.’’

‘‘నేను అడుగుతున్నదీ అదే. నీ గురించి రిపోర్టు మంచిగా ఇస్తే చాలా? ఆవిడ ఏమేం చేస్తున్నదీ నీకు వివరంగా చెప్పాలా?’’

‘‘వివరంగా చెప్పాలి.’’

‘‘దానికి మరో లక్ష అవుతుంది.’’

సత్యం కన్నార్పకుండా ప్రతాపరెడ్డివైపు చూస్తూ మనసులో అనుకున్నాడు. ‘తీసుకో ముసలోడా! ముందు ఆ కళ్యాణి సంగతి తేల్చనీ. తరువాత నీ సంగతి తేలుస్తాను’.

ప్రతాపరెడ్డి దగ్గర్నుంచి సత్యం హుటాహుటీన డాక్టర్ అశ్వత్థామ దగ్గరకు వెళ్ళాడు. ‘‘... మనం తొందరగా పని పూర్తిచేయాలి. ఆవిడకు అనుమానం వచ్చింది’’ అన్నాడు.

‘‘ఆ విషయం నాకు వదులు. మనుషుల మనస్తత్వాల్తో ఆడుకోవడం ఎలాగో నాకు పాతికేళ్ళ అనుభవం ఉంది’’.

సత్యం విసుగ్గా ‘‘నీ అనుభవం కాదు నాక్కావల్సింది. నా పని పూర్తవటం...’’ అన్నాడు.

‘‘కరెక్ట్...’’ అని గుమ్మం దగ్గర్నుంచి వినిపించింది. ఇద్దరూ ఉలిక్కిపడి వెనక్కి చూశారు. అక్కడ ప్రతాపరెడ్డి నిలబడి ఉన్నాడు. సత్యం కుర్చీలోంచి కోపంగా లేచి ‘‘నువ్విక్కడికి ఎలా వచ్చావ్?’’ అని అరిచాడు.

‘‘డిటెక్షన్...’’ అన్నాడు ప్రతాపరెడ్డి. ‘‘... నీ కార్యకలాపాల మీద కన్నేసి ఉంచమని కళ్యాణి చెప్పింది. అందులో భాగమే ఇదంతా.’’

''కానీ నేను నీకు డబ్బిచ్చాను.''

''అవును. అందుకే వచ్చాను. నేను నమ్మకద్రోహిని కాను. నీకు సాయం చేద్దామనే వచ్చాను. చూడు సత్యం. మీకిలాంటి వాటిలో అనుభవం లేదు. అందుకే కనీసం తలుపులు కూడా వేసుకోకుండా మాట్లాడుతున్నారు. రేపు మీ పని పూర్తయి ఆ కళ్యాణిని చంపేసినా రెండ్రోజుల్లో పోలీసులకు దొరికిపోతారు.''

సత్యం మొహం వాడిపోయింది. తామెంత తప్పుదార్లో వెళ్తున్నారో ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. ప్రతాపరెడ్డిని తమతో కలుపుకోవడం మంచిదని అనిపించింది. అందుకని తాము చేయదల్చుకున్న వ్యవహారం వివరంగా చెప్పాడు. స్లో పాయిజన్‌తో పని పూర్తి చేద్దామనుకున్న వారి ప్లాన్ విని, ''ఎప్పటికయ్యేను అది? ఈ లోపులో ఆ కళ్యాణి ముసల్దవుద్ది. లేదా మరో ఇద్దరు బాడీగార్డులను పెట్టుకుంటే ఏ అర్ధరాత్రో మీరే రెడ్‌హేండెడ్‌గా పట్టుబడతారు.'' నవ్వాడు.

''మరేం చేద్దాం?''

''ఆలస్యం అమృతం విషం. డైరెక్టుగా విషమే ఇద్దాం!''

అప్పటివరకూ మౌనంగా ఉన్న అశ్వత్థామ ఛాన్సు దొరికినట్టు ''ముగ్గురం ఉరికంబమెక్కుతాం'' అన్నాడు. అతడికి బాగా కసిగా ఉంది. ఈ పథకం మధ్యలో చేరిన ప్రతాపరెడ్డి క్షణాల్లో తనని డామినేట్ చేశాడని, తనని ఎందుకూ చేతకానివాడిలా నిరూపించాడని అతనికి అర్థమయింది. ఆ ఉక్రోషంతో ''ఈ ఆలోచన నాకూ వచ్చింది. కానీ శ్రీకళ్యాణి ఆస్తికి వారసుడు సత్యం. పోస్టుమార్టమ్ రిపోర్టులో కళ్యాణి మరణానికి కారణం తెలిస్తే సత్యం కటకటాల వెనుక ఉంటాడు'' అన్నాడు.

''కళ్యాణి మరణిస్తేనే కదా పోస్టుమార్టమ్ రిపోర్ట్ ప్రసక్తి వచ్చేది...'' ప్రతాపరెడ్డి నవ్వాడు. ''ఆ అమ్మాయి మరణించకుండా శరీరమంతా చచ్చుబడిపోయి జీవచ్ఛవంలా తయారైందనుకోండి. అప్పుడు పోస్టుమార్టమ్ ప్రసక్తే ఉండదు. పైగా ఎవరికీ అనుమానం రాదు. ఆ తరువాత మెంటల్‌గా చిన్న షాక్ ఇస్తాం. ఉదాహరణకి ఒక లీగల్ కేసులో కోటి రూపాయలు నష్టపోయినట్టు చిత్రిస్తాం. లీగల్ విషయాలు చూసేది సత్యమే కాబట్టి ఆ విషయాన్ని చాలా సులభంగా ఏర్పాటు చేయవచ్చు. ఆ రాత్రే ఆమె మరణించిందనుకోండి. ఎవరికీ అనుమానం రాదు. ఆ షాక్‌లో పోయిందనుకుంటారు. కళ్ళముందు తిరుగుతూ అకస్మాత్తుగా చనిపోతేనే పోస్టుమార్టమ్ జరుగుతుంది. జీవచ్ఛవంలాటి శరీరం పోతే పెద్దగా పట్టించుకోరు.''

''అద్భుతమైన ప్లాన్'' ఆనందంగా అన్నాడు సత్యం. ''మాకన్నా  వెయ్యి రెట్లు మెరుగైన ఆలోచన. ఎప్పుడు అమలు జరుపుదాం.''

''ఆ విషయం గురించి ఒక ఇంగ్లీషు పుస్తకంలో చదివాను. దాని పేరు XIC-20. ప్రాణం పోదుగానీ శరీరంలో ఏ అవయవమూ స్వాధీనంలో ఉండదు. పక్షవాతం వచ్చినట్టు శరీరమంతా చచ్చుబడి పోతుంది. ఆ విషాన్ని సంపాదించాలి. నా స్నేహితుడు ఒకడు ఇతోపియాలో ఉన్నాడు. అక్కడనుంచి తెప్పించాలి''.

'XIC-20... పేరు గమ్మత్తుగా ఉంది.''

''ఒక రకమైన పాము విషం నుంచి తయారుచేస్తారు దాన్ని! మార్ఫియా కన్నా పెద్ద ఎత్తున మత్తుకి అలవాటు పడ్డవాళ్ళు ఆ రకమైన పాముతో నాలుక మీద కాటు వేయించుకుంటారు. చాలా భయంకరమైన విషం. నరాలమీద డైరెక్టుగా తన ప్రభావం చూపించి నిర్వీర్యం చేస్తుంది.''

## 7

**''ఫెంటాస్టిక్''** అంది కళ్యాణి. ''నువ్వింత బాగా వంట చేయగలవని నాకు తెలీదు. చాలా అనుభవం ఉండి ఉండాలి నీకు.''

కార్తికేయ నవ్వి ఊరుకున్నాడు. ఆమె అంది. ''నువ్వు నాకు అబద్ధం చెప్పావ్. ఇంతకు ముందు చాలాకాలం ఎక్కడో వంటపని చేశావు కదూ?''

ఆ మాటలకి అతని మనసు చివుక్కుమంది. అయినా ఆ భావాన్ని బయటకు చూపించకుండా ''ఇంత చిన్న విషయానికి అబద్ధాలు దేనికండీ. వంటలో నాకు కొద్ది పరిచయం ఉంది'' అన్నాడు నెమ్మదిగా.

''చూడు. నేను దాదాపు పది సంవత్సరాల్నుంచీ కోట్లతో వ్యాపారం చేస్తున్నాను.వందల మందితో పని చేయిస్తున్నాను. ఎవరికెంత అనుభవం ఉందో క్షణాల్లో కనిపెట్టగలను.''

''కొంచెం అన్నం వడ్డించమంటారా?''

''మాట మారుస్తే తెలుసుకునేటంత అనుభవం కూడా ఉంది.''

అతడు జవాబు చెప్పలేదు.

''మాట్లాడవేం?'' అంది.

''మీ క్రింద పని చేసేవాడిని. ఏం మాట్లాడగలను?''

''వ్యక్తిత్వం ఉండాలి. నిజం చెప్పటానికి ధైర్యం కావాలి.''

''నన్ను ఉద్యోగంలోంచి తీసెయ్యరుగా''

''తీసెయ్యను. చెప్పు.''

''అయితే ఒక్క ప్రశ్న. ఎవరెలాంటివారో కనుక్కునే అనుభవం – వ్యాపారం ప్రారంభించిన ఎన్నేళ్ళకి మీకు వచ్చింది?''

‘‘ఎన్నేళ్ళకో ఏమిటి? నా చేతుల్లో కంపెనీ మొదటి సంవత్సరమే లాభాలు చూపించింది. ఎవరెలాంటి వాళ్ళో కొద్దిరోజుల్లోనే గ్రహించాను. ’’

‘‘దానికి అనుభవం అవసరం లేదా?’’

‘‘సునిశితమైన దృష్టి ఉంటే చాలు.’’

‘‘ఎవరెలాంటివారో గ్రహించడానికే అనుభవం అవసరం లేనప్పుడు, వంట బాగా వండటానికి అనుభవం దేనికండీ?’’

ఆమెకు పొలమారింది. దాన్ని కప్పిపుచ్చుకోటానికి ప్రయత్నిస్తూ అతడు నవ్వుకుంటున్నాడేమో అని ఓరగా చూసింది. అతడు అటువంటిదేమీ చెయ్యకుండా ‘‘మీరు కోపం తెచ్చుకోనంటే ఒక్క విషయం చెపుతాను’’ అన్నాడు. చెప్పమన్నట్టు సైగ చేసింది. ఆమె కొద్దిగా సర్దుకున్నాక అతనన్నాడు.

‘‘మీరెవరో తెలియనప్పుడు మీతో ధైర్యంగా మాట్లాడగలిగాను. ఇప్పుడయినా మీరు నా ఉద్యోగం పోదని ధైర్యం ఇచ్చారు కాబట్టి చెబుతున్నాను. మనిషి మీద మీకు చాలా తేలికైన అభిప్రాయం ఉంది. మీ మీద మీకు అంతులేని విశ్వాసం ఉండటంలో తప్పులేదు కానీ, మన సిద్ధాంతమే కరెక్టు అనుకోవటం, అవతలి వ్యక్తిమీద నమ్మకం లేకపోవటం తగదు. ‘అనుభవం లేకుండా వంట ఇంత బాగా ఎలా చేశావు?’ అన్నారు. నేను జీవితంలో మొట్ట మొదటిసారిగా బంగాళాదుంపలు వండినప్పుడు కూర కారంగా ఉంది. దుంపలు చప్పగా ఉన్నాయి. దుంపలకి ఉప్పూ కారం ఎందుకు పట్టలేదా అని ఆలోచించాను. దుంపల్లో ఉన్న నీరు బయటికొచ్చి అందులోకి ఉప్పూకారం ప్రవేశించాలంటే వాటిని నీటిలో ఉడక బెట్టకూడదు. దుంపల్ని ఉప్పు నీళ్ళల్లో కొన్ని గంటలు నానబెట్టాలి. లేదా... దుంపలో ఉన్న నీటికన్నా వెలుపలి నూనె బాయిలింగ్ పాయింట్ ఎక్కువ కాబట్టి ఉప్పూకారం వేసి నూనెలో కాస్త వేయించాలి అని అనుకున్నాను. అలాగే పుడ్డింగ్‌లో ఉట్టి పాలకన్నా మీగడ తరకలు ఉన్న పాలయితే మరింత రుచిగా ఉంటుందని గ్రహించాను. నాలుగు గుప్పెళ్ళు బియ్యం మసాలాలో వేయించి పులావులో కలిపి వండితే ఆ రుచి వేరుగా ఉంటుందని తెలుసుకున్నాను. ఆమ్లెట్ కోసం కొట్టిన కోడిగుడ్డు రెండు నిమిషాలకన్నా ఎక్కువ సేపు బయట గాలిలో ఉండకూడదని, ఆమ్లెట్ ఎప్పుడూ నూనెలో కాక నెయ్యిలో వేయించాలనీ తెలిసింది. చిక్కటి గంజికన్నా పెద్ద గిన్నెలో ఎక్కువ నీళ్ళుపోసి వారిస్తే అన్నం పొడిపొడిగా ఉంటుందని రెండు రోజుల అనుభవం నేర్పింది. కొందరాడవాళ్ళు ఇలాటివి కొద్దిరోజుల్లో నేర్చుకుని ఉండొచ్చు. మరికొందరు మనవలు పుట్టినా తెలుసుకోకపోయి ఉండవచ్చు. కాబట్టి వంట బాగా వండటానికి సంవత్సరాల తరబడి అనుభవం అవసరం లేదు. సునిశితమైన దృష్టి ఉంటే చాలు’’ ఆమె చివరిమాట ఆమెకే ఒప్పజెప్పుతున్నట్టు అన్నాడు.

ఆమె మొహం ఎర్రబడింది. ‘‘అది చెప్పటానికేనా వంటల మీద ఇంత సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చావ్? ఇవన్నీ నాకు తెలుసు. వంట నేనూ చెయ్యగలను’’ అంది.

‘‘అయితే చెప్పండి. అన్నం ఉడగ్గానే ప్రెషర్ కుక్కర్ ఏ కారణంతో విజిల్ వేస్తుంది?’’

సమాధానం తెలియకపోవటం వల్లో, అతడు అడిగిన విధానం వల్లోగానీ ఆమె మొహం మరింత అరుణ వర్ణం దాల్చింది. ఆమెను మరింత ఇరిటేట్ చేయటానికా అన్నట్టు ‘‘కాబట్టి మాడమ్. ఒక ఫీల్డులో ఉన్న వాళ్ళకు, తమ ఫీల్డు తప్ప మిగతావన్నీ చాలా సులభంగా అనిపిస్తాయి. ఇప్పుడు మీరేమను కుంటున్నారో కూడా నేను చెప్పగలను’’ అన్నాడు.

ఒక వంటవాడు తనని నిలదీస్తున్న విధానం పట్ల చెలరేగిన కోపాన్ని కంఠంలో చూపిస్తూ ‘‘ఏమనుకుంటున్నాను’’ అని తీక్షణంగా అడిగింది.

‘‘నన్ను ఉద్యోగంలోంచి తీసెయ్యాలనుకుంటున్నారు.’’

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments